అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పాలన

- సీఎం జగన్ పాలనపై ఎమ్మెల్యే కురసాల
- రూ.14.55 కోట్లతో వాటర్ ట్యాంకుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన
- నియోజకవర్గంలో నీటి సమస్య లేదని వెల్లడి



పండూరులో సమగ్ర తాగునీటి పథకం విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, సంక్షేమానికి ఆయన పేరే ఒక బ్రాండ్ అని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని పండూరు, సూర్యారావుపేట గ్రామాలలో మంగళవారం ఆయన పర్యటించి రూ.14.55కోట్ల నిధులతో గ్రామీణ నీటి సరఫరా పథకం పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేట్టారు. తొలుత సూర్యారావుపేట గ్రామంలో మైనర్‌పేట, పర్లోపేట ప్రాంతాలలో రూ.62 లక్షలతో నిర్మించిన రెండు వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. రూ.35 లక్షలతో గ్రామంలోను, జగన్న కాలనీలో నిర్మించనున్న మరో రెండు ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పండూరులో అర్బన్ హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించిన పండూరు–1 లే అవుట్‌లో రూ.2.42 కోట్లతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులు శంకుస్థాపన చేశారు. మండల ప్రజల దాహార్తిని తీరుస్తున్న పండూరు సమగ్ర తాగునీటి పథకం విస్తరణ పనులకు రూ.9.3 కోట్లతో శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో సుమారు రూ.110 కోట్ల పైబడి నిధులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేశామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడినా అంతకు ముందు కాకినాడ రూరల్ నియోజకవర్గం ఇప్పటిలా అభివృద్ధి జరగలేదన్నారు. 31 వేల మందికి పట్టాలు ఇవ్వడమే కాకుండా జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సీఎం జగన్ ఆశీస్సులతో పండూరు, నేమాం పరిసర ప్రాంతాలలో 15వేలకు పైగా ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. సూర్యారావుపేట మత్స్యకార గ్రామానికి తాగునీటిని అందించామన్నారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా అభివృద్ధి, సంక్షేమం కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తున్నాయన్నారు. ఈ ఒక్క నియోజకవర్గంలోనే 37 వేల పింఛన్లు వస్తున్నాయన్నారు. 45వేల మందికి వైఎస్సార్ ఆసరా వచ్చిందన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, సూర్యారావుపేట సర్పంచ్ సూరాడ చిన్ని, నాయకులు రాజు, సత్యనారాయణ, సింహాద్రి, పండూరు గ్రామ ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు సత్తిబాబు, ధర్మరాజు, రాంబాబు, తమ్మలపల్లి చంటి, ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చౌదరి, డీఈ శ్రీదేవి, ఏఈ మారుతీరామ్, పంచాయతీ కార్యదర్శి మోహన్, వీఆర్వో శ్రీనివాస్, కొప్పిశెట్టి గణేష్, కొత్తెం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సూర్యారావుపేటలో సామాజిక భవనానికి ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

మత్స్యకార గ్రామం సూర్యారావుపేటను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశామని, అర్హులందరికీ స్థలాలు ఇచ్చామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. రూ.13 లక్షలతో నిర్మించిన శెట్టిబలిజ సామాజిక భవనం, రోడ్లు, లైబ్రరీ, శ్మశాన వాటికి అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. ఎన్నికల్లో తమకు అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ సూరాడ చిన్ని, రాజు, కోమలి సత్యనారాయణ, అర్జునరావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సభ్యుల సేవలు ప్రశంసనీయం



శ్యామ్ దంపతులను సత్కరిస్తున్న రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ సభ్యులు నిస్వార్థ సేవలు అందిస్తున్నారని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్‌రావు అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సపరివార సకుటుంబ సమ్మేళనం మాఘ మధురిమలు పేరిట స్థానిక విద్యుత్‌నగర్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరిశెట్టి రవికృష్ణ, కార్యదర్శి జె.చంద్రరావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ రావు మాట్లాడుతూ క్లబ్ సభ్యులు సమాజంలో ప్రజలకు కావాల్సిన అవసరాలు గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు నిర్వహిస్తున్నారన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్ సమాజానికి చేస్తున్న సేవాకార్యక్రమాలు మరువలేనివన్నారు. ఈసందర్భంగా శ్యామ్ దంపతులను సత్కరించారు. క్లబ్ సభ్యులు బాలకృష్ణ, ఉదయభాను, మాచారెడ్డి, చిరంజీవిరెడ్డి, చార్మినార్ వర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదల కోసం సంక్షేమ పథకాలు

బోట్‌క్లబ్: పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని నగర పాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు పేర్కొన్నారు. స్థానిక ప్రతాప్ నగర్ వాటర్ ట్యాంక్, కొండయ్య పాలెం, నూకాలమ్మ ఆలయం ప్రాంతాలలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. బీజేపీ నగర కన్వీనర్, గట్టి సత్యనారాయణ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా శిరిడీసాయి గ్రామోత్సవం



గురజనాపల్లిలోని శిరిడీసాయిబాబా

కరప: మండలం గురజనాపల్లిలో మంగళవారం శ్రీరామసాయి మందిరం 15వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలు 5 రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ వ్యవస్థాపకుడు కర్నాసుల శివకుమార్ తెలిపారు. అర్చకులు వెలవలపల్లి కామేశ్వరశర్మ, వాసవీ అచ్యుతరామశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీలక్ష్మి శ్రీనివాసా నర్సింగ్‌హోమ్ అధినేత డాక్టర్ సత్తి చంద్రారెడ్డి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు.

స్త్రీ జాతి శిరోమణి సరోజినీ దేవి

కాకినాడ రూరల్: మహిళాభివృద్ధి కోసం పాటుపడిన గానకోకిల సరోజినీదేవి స్వరాజ్య సమరంలో అగ్ర భాగాన నిలిచిన తొలి మహిళ అని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సరోజినీదేవి జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, కర్ణాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసులో ఇద్దరికి జైలు

కాకినాడ క్రైం: నాటుసారా తయారీ కేసులో ఇద్దరికి కోర్టు జైలు శిక్ష విధించింది. సంబంధిత వివరాలను కాకినాడ నార్త్ స్టేషన్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్‌బి పెద్దిరాజు మంగళవారం కాకినాడ సెబ్ స్టేషన్‌లో విలేఖరులకు వెల్లడించారు. 2019 నవంబర్ 20న సామర్లకోటలో జరిపిన తనిఖీలలో ఇద్దరు నాటుసారా తయారు చేస్తూ పట్టుబడ్డారన్నారు. వారి నుంచి సెబ్ బృందం 60 లీటర్ల సారాతో పాటు 100 లీటర్ల పులిసిన బెల్లం ఊట స్వాధీనం చేసుకుందని, నిందితులు గుబ్బల సుబ్రహ్మణ్యం, పితాని భీమేశ్వరరావును అప్పటి ఎక్సైజ్ ఎస్ఐ జీవీ నరసింగరావు అరెస్టు చేయగా, ఏఎస్ఐ గౌరీశ్వరరావు విచారించారన్నారు. మంగళవారం నిందితులకు చెరో ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు, ఒకొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్) కోర్టు మెజిస్ట్రేట్ నాగమల్లీశ్వరి తీర్పు చెప్పారని, ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సీహెచ్ జగదీష్ వాదనలు వినిపించారని వెల్లడించారు.

పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ కార్యవర్గం



కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఫాదర్ రాజ్‌కుమార్

కరప: మండలం గొడ్డటిపాలెంలోని పాస్టర్ మేడపాటి కృపావరం సిలువ సన్నిధి చర్చిలో మంగళవారం పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకుడు రెవరెండ్ ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్ అధ్యక్షతన కొత్తకార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్‌గా గంజా జాన్‌ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా మడికి సాల్మన్‌రాజు, సెక్రటరీగా మోసా థామస్, జాయింట్ సెక్రటరీగా కొమ్ము ప్రసన్నరాజు, ట్రెజరర్‌గా సిర్రా జాన్‌భాస్కర్, సభ్యులను ఎన్నుకున్నారు. ఫెలోషిప్ చీఫ్ పేట్రన్ గాడ్విన్, ముఖ్య సలహాదారులు కె.జాన్‌క్రిస్టోఫర్, ఎస్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి

కరప: ప్రధాని నరేంద్రమోదీ పాలనతోనే ప్రజా సంక్షేమంతో పాటు, దేశం అన్ని రంగాలలో ప్రగతి సాధించిందని బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కోకన్వీనర్ ఘంటసాల గోవిందరాజు పేర్కొన్నారు. మండల గొర్రిపూడిలో మంగళవారం ఆయన పార్టీనాయకులు, కార్యకర్తలతో కల్సి పర్యటించి, ఇంటింటికీ తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులను వివరించి, వికసిత భారత్ కరపత్రాలను, క్యాలండర్లను అందజేశారు. పోరుబాట కోకన్వీనర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, బీజేపీ జిల్లా కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడే వెలసినట్టు..



ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం



ప్రారంభానికి సిద్ధమైన ఆలయం వద్ద ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబసభ్యులు

- నేడు వైభవ వేంకటేశ్వరుని విగ్రహప్రతిష్ఠ
- రూ.4 కోట్లతో ఆలయ నిర్మాణం

కాకినాడ: తిరుమల వెంకన్నను ఇక్కడే దర్శించుకున్న అనుభూతి కలిగేలా పూర్తి రాతికట్టడంతో వైభవ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం కాకినాడలో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు రూ.4 కోట్ల సొంత నిధులు వెచ్చించి పూర్తి రాతి కట్టడంగా ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. మాఘమాసం సందర్భంగా గురువారం ఉదయం ఈ ఆలయంలో విగ్రహప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఈ ఆలయం ప్రారంభం కాబోతోంది.

నాడు కోనేరు–నేడు ఆలయం

స్థానిక సాంబమూర్తినగర్ బాలవేంకటేశ్వరనగర్ ప్రాంతంలో పురాతన కోనేరుగా ఉన్న ప్రాంతమే ఇప్పుడు వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంగా రూపుదిద్దుకుంది. విష్ణుమూర్తి శేషపాన్పుపై ఇక్కడ పవళించారని భక్తుల నమ్మిక. కాలక్రమేణ ఆ ప్రాంతం డంప్‌యార్డుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో స్వామివారి దేవస్థానానికి చెందిన భూమిగా ఆ ప్రాంతం ఉండిపోయింది. దేవస్థానానికి చెందిన పూర్వీకులు, వారి వారసులు ఏకమై ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని కలిసి వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని పునఃనిర్మించేందుకు ప్రతిపాదించారు. అనుకోని విధంగా వచ్చిన ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించిన ఆయన యుద్ధ ప్రాతిపదికన ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

పూర్తి రాతికట్టడం

స్వామివారి ఆలయాన్ని పూర్తి రాతికట్టడంగా నిర్మించారు. కృష్ణశిలను రామప్ప కొండనుంచి రప్పించి త్రిపురసుందరి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు పర్యవేక్షణలో తిరుపతికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా వాస్తవ్యుడు వీరవరపు చంద్రరావు, చెన్నైకు చెందిన ముత్తంభట్టి భూమినాథన్ అనే కాంట్రాక్టర్‌తో నిర్మాణాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఆలయంలో ధ్వజస్తంభంతో పాటు వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవి, గోదాదేవి అమ్మవార్లతో పాటు జయ, విజయులు, గరుడ విగ్రహాలను సిద్ధం చేశారు. వీటితో శిఖరప్రతిష్ఠ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

నేడు విగ్రహప్రతిష్ఠ

వైభవ వేంకటేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠను బుధవారం ఉదయం 10.58 నిమిషాలకు ప్రతిష్ఠించనున్నారు. ఈ ప్రక్రియకు ముందుగానే ద్వారంపూడి దంపతులు మూడు రోజులపాటు విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహప్రతిష్ఠ చేయనున్నారు.

పూర్వజన్మ సుకృతం



ఆలయాన్ని నిర్మించే అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. నిర్మాణం కోసం ఎక్కడా విరాళాలు వసూలు చేయకుండా పూర్తి నిధులు సమకూర్చి నిర్మించాను. ఆధ్యాత్మికతకు నిలయమైన కాకినాడలో ఈ ఆలయం ఉండడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో సంతోషకరమైన అంశంగా భావిస్తున్నాను.

ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, సిటీ ఎమ్మెల్యే

నిధులున్నా పనుల్లో జాప్యమేంటి?

- ఆర్ అండ్ బీ అధికారులపై మండల పరిషత్ సభ్యుల ధ్వజం
- వివిధ శాఖలపై సమీక్ష



కరప మండల సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: మండల పరిధిలో రహదారుల అభివృద్ధికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నిధుల మంజూరు చేసినా, పనుల్లో జాప్యం చేస్తున్న అధికారుల పనితీరుపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తంచేశారు. కరప, అరట్లకట్ట రోడ్డు, కాకినాడ అన్నమ్మఘాటీ నుంచి కరప మండలం పెనుగుదురువంతెన, అక్కడి నుంచి విజయరాయుడుపాలెం రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యంపై సభ్యులు ప్రశ్నించడంతో ఆ శాఖ ఏఈఈ బదులిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసమావేశం జరిగింది. కొరుపల్లి ఎంపీటీసీ సభ్యుడు దేవిశెట్టి సూర్యప్రకాశరావు, పాతర్లగడ్డ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు తదితరులు ఆర్ అండ్ బీ శాఖ పనులపై ప్రశ్నించారు. దీనిపై జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు కల్పించుకుని పనులు సకాలంలో పూర్తిచేయాలని, రోడ్ల మార్జిన్లలో జంగిల్ క్లియరన్స్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈఈ సాయిబాబారెడ్డికి సూచించారు. ఎంఏఓ ఏవీ రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఈ క్రాప్ చేయించుకోవాలని సూచించారు. మండల వైద్యాధికారి ఆర్.శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ఫ్యామిలీడాక్టర్, జగనన్న సురక్ష, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు 84 శాతం జరిగి మండలం ముందంజలో ఉందన్నారు. ఎంపీడీఓ కె.అప్పారావు వివిధ శాఖల ప్రగతిని సమీక్షించారు. ఎంపీపీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రోద్బలంతో మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మండల ఉపాధ్యక్షుడు బొమ్మితి వీర్రాఘవులు, ఏఓ గుత్తుల భీమశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిల్క్ బ్యాంక్ వారోత్సవం



ఓ తల్లికి పండ్లు అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, హెచ్‌వోడీ తదితరులు

కాకినాడ క్రైం: జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన ధాత్రి మిల్క్ బ్యాంక్ వారోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. మాతా, శిశు భవంతిలో ఉన్న మిల్క్ బ్యాంకులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ, ధాత్రి బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మాట్లాడుతూ సత్సంకల్పంతో ప్రారంభమైన మిల్క్ బ్యాంక్ సేవలు ఏడాది కాలం ముగించుకుని వందలాది శిశువులకు ప్రయోజనం చేకూర్చిందన్నారు. రాష్ట్రంలోనే తొలి మిల్క్ బ్యాంక్ ఇక్కడ ఏర్పాటు కావడం మాతాశిశువులకు ఎంతో ప్రయోజనం అన్నారు. హెచ్‌వోడీ డాక్టర్ మాణిక్యాంబ మాట్లాడుతూ ధాత్రి, జీజీహెచ్ బృందాలు సంయుక్తంగా తల్లి పాల ప్రయోజనాన్ని తల్లులకు వివరిస్తున్నాయన్నారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ గడచిన ఏడాదిలో 1350 మంది తల్లులు తల్లిపాల సద్వినియోగం, ఉత్పత్తిపై శిక్షణ, చికిత్స పొందారని అన్నారు. 3,60,114 ఎంఎల్ పాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధాత్రి మేనేజర్ మాధవ్‌తో పాటు సిబ్బంది, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, పీడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు విజయభాస్కర్, రాంబాబు, పూర్ణిమ, పీడియాట్రీషియన్లు సుబ్రహ్మణ్యం, సూర్య, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. 60 మంది తల్లులు తమ శిశువులతో కలిసి వారోత్సవానికి హాజరయ్యారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు వలంటీర్లు



రమణయ్యపేట గ్రామంలోని వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: ప్రభుత్వానికీ ప్రజలకు వారధిగా వలంటీర్లు సేవలందిస్తున్నారని, నిత్యం ప్రజల్లో ఉండాలని నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ కోరారు. రమణయ్యపేట గ్రామ పంచాయతీలోని ఐదు సచివాలయాల పరిధిలో వలంటీర్లతో వైద్యనగర్‌లోని ఎమ్మెల్యే కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రజలకు మెరుగ్గా సేవలందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకువచ్చారని, దేశంలో ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం జగన్, ఎమ్మెల్యే కన్నబాబు ప్రజలకు చేస్తున్న సేవల్లో వలంటీర్లు భాగస్వాములుగా పనిచేయడం అభినందనీయమని, అండగా నిలివాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, కాపు కార్పొరేషన్ డైరెక్టరు లింగం రవి, ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, నాయకులు రేఖారెడ్డి, ధర్మారావు, సురేష్, నాని, కృష్ణంరాజు, మాచవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లే అవుట్‌ను పంపిణీకి సిద్ధం చేయాలి



కరపలోని సెంట్రల్ లేఅవుట్‌ను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మండలంలోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలిచ్చేందుకు స్థానిక సెంట్రల్ లే అవుట్‌ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. మండల పర్యటనలో భాగంగా మంగళవారం ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలసి కరప సెంట్రల్ లేఅవుట్‌ను పరిశీలించి, అధికారులతో చర్చించారు. సెంట్రల్ లే అవుట్‌లో ఇప్పటికే 7 ఎకరాలు మెరకచేయడం జరిగిందని, మిగిలిన 40 ఎకరాల్లో చదును చేసే పనులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. యుద్ధప్రాతిపదిక పనులు పూర్తిచేసి, పట్టాలిచ్చేందుకు అనువుగా లే అవుట్‌ను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ కె.అప్పారావు, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, మండల సర్వేయర్ ఈ.రామకృష్ణ, గ్రామకార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లలో వసతులు కల్పించాలి

ఈఆర్వో వెంకటరావు ఆదేశం



కౌంటింగ్ కేంద్రంలోని సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: ప్రతి పోలింగ్ బూత్‌లోనూ ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆయన రేచర్లపేట, రామకృష్ణారావుపేట, రామారావుపేట తదితర ప్రాంతాల్లోని పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. సౌకర్యాలు లేని పక్షంలో తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలోని సూపర్‌వైజర్లు, బీఎల్వోలు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాల సందర్శన

నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం సాయంత్రం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. తొలుత మెక్లారిన్ ప్రాంగణంలోని ఈవీఎంల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జేఎన్‌టీయూకే సివిల్ ఇంజనీరింగ్ బ్లాక్‌లో ప్రతిపాదించిన కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్‌రూమ్‌లను ఎన్నికల అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అక్కడ కల్పించాల్సిన సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట ఏఈఆర్వోలు కె.చల్లన్నదొర, మురళీకృష్ణ, టౌన్ సర్వేయర్ ఆచారి, ఏఈ రమేష్, డీసీపీ హరిదాస్ తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలి

ఈఆర్వో వెంకటరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: రానున్న ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024 ప్రగతిపై రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు, పరిష్కారాలను ఆయన నాయకులకు వివరించారు. అలాగే వారి సందేహాలను నివృత్తి చేశారు. 80 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులు, అంధులు పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు వేసేందుకు వీలుగా కల్పించిన ప్రత్యేక సదుపాయాలపై సభ్యులు చర్చించారు. అనంతరం ఈఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు(బీఎస్పీ), ఏఈఆర్వోలు హరిదాసు, దొర, నాగశాస్త్రులు, సీతాపతిరావు, జాన్‌బాబు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిలయన్స్ సీఎస్సార్ ప్రతినిధి సుబ్రహ్మణ్యం

కాకినాడ : రాష్ట్రంలో మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జె.నరసింహానాయక్ పేర్కొన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ సామాజిక సేవలో భాగంగా మాతా, శిశు సంక్షేమ సంరక్షకులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రిలయన్స్ సంస్థ చేపట్టిన కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు అందిపుచ్చుకుని సమాజానికి ఆరోగ్యవంతమైన పిల్లలను అందించాలని సూచించారు. రిలయన్స్ సీఎస్సార్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏటా మాతా శిశు సంక్షేమంపై అవగాహన కల్పించి పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతిపురం, చినవలసల, గోపాలపురం, బాబానగర్ గ్రామాల నుంచి హాజరైన సుమారు 100 మంది బాలింతలకు పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. ఆర్ఎంవో డాక్టర్ అనిత, కె.స్వాతిదేవి, సీడీపీవో వి.మాధవి తదతరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో మెగా రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీనివాసరావు

కాకినాడ: రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ఆర్టీసీ డిపోలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ రెడ్‌క్రాస్ సంస్థల సౌజన్యంతో ఈ శిబిరం ఏర్పాటైంది. జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలకు చెందిన సుమారు 110 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ కామరాజు, డాక్టర్ రామ్మోహన్‌ప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ టి.శ్రీనివాస్, కాకినాడ డిస్పెన్సరీ వైద్యులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణపై కేసు

కొత్తపల్లి: ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్టు మంగళవారం పోలీసులు తెలిపారు. అమీనాబాదు గ్రామానికి చెందిన ఓసుపల్లి ఇస్సాక్, అదే గ్రామానికి చెందిన రామిశెట్టి జ్యోతిబాబు కుటుంబ తగాదా విషయమై సోమవారం గ్రామ పెద్దల వద్దకు వెళ్లారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదరకపోవడంతో పాటు, ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. వారు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.